# కొలువుల మనీష

- గురుకుల బోర్డు ఫలితాల్లో సత్తా
- ఒకేసారి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు




కోనరావుపేట, మార్చి1: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒక్క ఉద్యోగం సాధించేందుకే కష్టపడుతున్న ఈ రోజుల్లో ఒకేసారి నాలుగు కొలువులు కొట్టి ఆదర్శంగా నిలిచింది రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిజామాబాద్‌కు చెందిన దుగ్గు మనీష. రాజేందర్, లలిత దంపతుల రెండో కూతురైన ఈమె, చిన్ననాటి నుంచే చదువులో ముందుండేది. గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో 2023లో గురుకుల నియామక బోర్డు (ట్రిబ్) నోటిఫికేషన్ వేయగా, చాలా కష్టపడి చదివింది. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో సత్తాచాటి పీజీటీ, టీజీటీ, జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ కొలువులు సాధించి పలువురి ప్రశంసలందుకున్నది.

# కరీంనగర్‌లో న్యూరో వైద్య సదస్సు



న్యూరో వైద్యుల సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్లు సుకుమార్‌రెడ్డి, మానస్‌ఫణిగ్రహి

విద్యానగర్, మార్చి1 : కరీంనగర్‌లో మూడురోజుల పాటు నిర్వహించనున్న న్యూరో వైద్యుల 8వ రాష్ట్ర స్థాయి వైద్య సదస్సును రేనె హాస్పిటల్‌లో న్యూరో వైద్యులు శుక్రవారం సుకుమార్‌రెడ్డి, మానస్‌ఫణిగ్రహి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడి నుంచి లైవ్ సర్జరీలు సీఎంఈ కార్యక్రమాలు ఉంటాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా న్యూరో సర్జన్లు, ఫిజీషియన్లు, వైద్య విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు.



మేడిగడ్డ ప్రాజెక్టును పరిశీలిస్తున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, తదితరులు



అన్నారం ప్రాజెక్టును పరిశీలిస్తున్న కేటీఆర్



మేడిగడ్డకు చేరుకున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, కౌశిక్ రెడ్డి, తదితరులు

## కేసీఆర్‌పై కోపంతో..

కాళేశ్వరం ప్రాజెక్టు యాత్రలో బీఆర్ఎస్ నేతలు కడియం, కేటీఆర్, హరీశ్

# రైతులపై పగబట్టకండి

- మేడిగడ్డకు మరమ్మతులు చేయించి.. నీళ్లను లిఫ్ట్ చేయండి
- 3 పిల్లర్లకు సమస్య వస్తే.. కాళేశ్వరం మొత్తం నష్టపోయిందని బద్నాం చేస్తున్నరు
- రైతులకు కామధేనువు లాంటిది కాళేశ్వరం

'కాళేశ్వరం ప్రాజెక్టు రైతులకు కామధేనువు. అటువంటి కాళేశ్వరాన్ని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయండి. నీళ్లను వెంటనే లిఫ్ట్ చేసి రైతులకు అందించండి. నల్లగొండ సభలో కేసీఆర్ ఇచ్చిన మాట మేరకు బీఆర్ఎస్ నేతలమంతా మేడిగడ్డకు వచ్చాం. ప్రాజెక్టు రక్షణ చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వమే గోబెల్స్ ప్రచారం నిర్వహిస్తున్నది. దాన్ని అడ్డుకుని ప్రజలకు వాస్తవాలు వివరించేందుకే ఇక్కడికి వచ్చాం. 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 21 పంపింగ్ స్టేషన్లు, 273 కిలోమీటర్ల పొడవైన టన్నెల్స్, 1500 కిలోమీటర్లకు పైగా ఉండే కాలువలు కలిగిన భారీ ప్రాజెక్టు కాళేశ్వరంలో కేవలం మేడిగడ్డ బ్యారేజీలో 3 పిల్లర్లకు సమస్యలు వస్తే రాద్ధాంతం చేస్తున్నారు' అని బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ వైఖరిని తూర్పారబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న దుష్ప్రచారంపై వాస్తవాలు ప్రజలకు తెలియజెప్పేందుకు బీఆర్ఎస్ నేతలు శుక్రవారం చేపట్టిన చలో కాళేశ్వరంలో భాగంగా ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, కడియం శ్రీహరి మాట్లాడారు. కేసీఆర్‌పై కోపముంటే ఆ కోపాన్ని దయచేసి రైతులపై రాష్ట్రంపై చూపవద్దని వారు కోరారు. ఆలస్యం చేయకుండా మేడిగడ్డకు మరమ్మతులు చేయించి రైతులకు సకాలంలో నీళ్లు అందేలా చూడాలని చెప్పారు.



పగుళ్లను పరిశీలిస్తున్న మాజీ ఎంపీ వినోద్ కుమార్, జడ్పీ చైర్‌పర్సన్లు కనుమల్ల విజయ, దావ వసంత, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద పరిశీలిస్తున్న రాజ్యసభ్యుడు దీవకొండ దామోదర్‌రావు



మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద కేటీఆర్, ఎంపీ నామ నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్



ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, వేముల ప్రశాంత్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, గండ్ర వెంకటరమణా రెడ్డి, మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్, దేవిప్రసాద్, తదితరులు



మేడిగడ్డ వద్ద కేటీఆర్, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, గంగుల కమలాకర్

## నాలుగైదేండ్ల తర్వాత మళ్లీ తిప్పలు

- ఎన్నడూ లేని విధంగా ఫిబ్రవరిలోనే మొదలైన కష్టాలు
- హైలెవల్ జోన్‌లోని పలు డివిజన్లలో రోజు విడిచి రోజు సరఫరా
- ఇప్పటికే ట్యాంకర్ల ద్వారా..
- ఎల్ఎండీ నీటిమట్టం తగ్గితే మరింత ముప్పే
- నగరవాసుల్లో ఆందోళన

# నగరంలో నీటి కటకట

**ఇంకా వేసవి ఆరంభం కానేలేదు. ఎండలు ముదరనే లేదు. కానీ, అప్పుడే కరీం'నగరం'లో నీటి కటకట మొదలైంది. నాలుగైదేండ్లుగా లేని నీటి సమస్య మళ్లీ ఇబ్బంది పెడుతున్నది. పది పదిహేను రోజులుగా హైలెవల్ జోన్‌లోని ఏడు డివిజన్ల ప్రజలు నల్లానీరు ఎప్పుడు వస్తుందా? అని ఎదురుచూస్తున్నారు. రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తుండడం, అది లోప్రెషర్‌తో ఇస్తుండడంతో సరిపోక ట్యాంకర్ల కోసం పడిగాపులు గాస్తున్నారు. గతంలో కేసీఆర్ సర్కారు అర్బన్ మిషన్ భగీరథతో తాగునీటి కష్టాలు తీర్చిందని, మండుటెండల్లోనూ ప్రతి రోజూ నీటిని సరఫరా చేసిందని గుర్తు చేస్తున్నారు. కానీ, ఇప్పుడు మళ్లీ గోసపడే రోజులు వచ్చాయని, ఇప్పుడే ఇలా ఉంటే ముస్ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.**



22వ డివిజన్ సుభాష్‌నగర్‌లో నగర పాలక సంస్థ ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న కాలనీవాసులు

కార్పొరేషన్, మార్చి 1 : ఒకప్పుడు కరీంనగరంలో నీటి కటకట తీవ్రంగా ఉండేది. ఎండాకాలం వచ్చిందంటే చాలు ప్రజలు చాలా ఇబ్బంది పడేది. రోజు విడిచి రోజు గంటపాటు నీటిని సరఫరా చేసినా.. అవి లో ప్రెషర్‌తో రావడం వల్ల ఎటూ సరిపోకపోయేవి. హైలెవల్ జోన్‌లో సమస్య ఎక్కువగా ఉండేది. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సి వచ్చేది. నగర జనాభాకు అనుగుణంగా ప్రణాళిక లేకపోవడం, ఎల్ఎండీలో నీరు తగ్గడం వల్లే సమస్య ఎదురైనా ఎవరూ పట్టించుకునేది కాదు. ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసేది కాదు. కానీ, కేసీఆర్ సర్కారు వచ్చిన తర్వాత ఈ సమస్యకు పరిష్కారం చూపింది. అర్బన్ మిషన్ భగీరథ కింద ₹110 కోట్లు వెచ్చించి ఏర్పాట్లు చేసి, ప్రతి రోజూ గంటపాటు తగినంత ప్రెషర్‌తో మంచినీటిని సరఫరా చేసింది. ఎల్ఎండీలో నీటి మట్టం తగ్గినప్పుడు ఎగువ శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి నీటిని విడుదల చేసి మరీ ఇబ్బందులు రాకుండా చూసింది. కానీ, ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. నాలుగైదేండ్లుగా తాగునీటి సరఫరా సక్రమంగానే సాగినా.. ఈ సారి మాత్రం సమస్య అప్పుడే మొదలైంది. ఒకప్పుడు ఏటా ఏప్రిల్ లేదా మేలో కొరత మొదలైనా.. ఇప్పుడు ప్రజలు ఫిబ్రవరి నుంచే ఇబ్బంది పడాల్సి వస్తున్నది. ప్రధానంగా కోర్టు రిజర్వాయర్ పరిధిలోకి వచ్చే హైలెవల్ జోన్‌లో ముప్పు ఎక్కువగా కనిపిస్తున్నది. కోర్టు, విద్యానగర్, రాంనగర్, ఎస్ఆర్ఆర్, అంబేద్కర్‌నగర్ రిజర్వాయర్ పరిధిలో నీటి సరఫరాకు ఇబ్బందులు వచ్చేలా ఉన్నాయని ఇంజినీరింగ్ అధికారులే చెబుతున్నారు. ఇప్పటికే ఏడు డివిజన్లలో సమస్య ఉత్పన్నం కాగా, హై లెవల్ జోన్ పరిధిలోని 17, 38, 39, 56, 22 డివిజన్లతో పాటు సీతారాంపూర్, ఆరెపల్లి సమీపంలోని అనేక కాలనీలకు పది రోజులుగా రోజు విడిచి రోజు మంచినీరు ఇస్తున్నారు. ప్రస్తుతం ఎల్ఎండీలో 8 టీఎంసీల కంటే కూడా తక్కువగా ఉండడంతో రా వాటర్ తీసుకోవడానికి బూస్టర్ పంపులను వాడుతున్నారు. ఫిల్టర్‌బెడ్ నుంచి మెయిన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేసేందుకు మోటర్లను ఎక్కువగా వినియోగిస్తున్నారు. అయినా వల్ల ఆయా రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపలేకపోతున్నారు. ఈ కారణంగానే నీటి సరఫరాలో సమస్యలు తలెత్తుతుండగా, ఆయా డివిజన్ల ప్రజలు ట్యాంకర్ల కోసం ఎదురుచూడాల్సి వస్తున్నది. 22వ డివిజన్‌తోపాటు సుభాష్‌నగర్, నూతన కుర్మవాడ, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో ప్రతి రోజూ ట్యాంకర్ల ద్వారా నీరందించే దుస్థితి వచ్చింది. ఎల్ఎండీలో నీటిమట్టం తగ్గితే ముప్పు మరింత తీవ్రమవుతుంది. ముఖ్యంగా హై లెవల్ జోన్‌లో 40 డివిజన్లలోనూ సమస్య ఉత్పన్నమయ్యే ప్రమాదం కనిపిస్తున్నది.

### మండిపడుతున్న ప్రజలు

హైలెవల్ జోన్‌లో నీటి కటకటతో ఏడు డివిజన్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నాలుగైదేండ్ల తర్వాత సమస్య మొదలైందని వాపోతున్నారు. గతంలో ఎన్నడూ ట్యాంకర్ల కోసం చూడలేదని, ఇప్పుడు మాత్రం ఎదురుచూడాల్సి వస్తున్నదని చెబుతున్నారు. మార్చి మొదటివారంలోనే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో తమ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ముస్ముందు ఎండలు ముదురుతాయని, భూగర్భ జలాలు పడిపోతాయని, బోర్లలోనూ అడుగంటుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎల్ఎండీలో నీటిమట్టం తగ్గిందని అధికారులు చేతులెత్తేస్తున్నారని విమర్శిస్తున్నారు. కానీ, గతంలో ఎల్ఎండీలో నీళ్లు తగ్గినప్పుడు మిడ్‌మానేరు నుంచి నీటిని విడుదల చేసి సమస్యరాకుండా చూసేవారని గుర్తు చేస్తున్నారు. ఈ సారి అలా ఎందుకు చేయడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, ప్రతి రోజూ నీరందించాలని కోరుతున్నారు.

### ఇబ్బందులు రాకుండా చూస్తాం

ఎల్ఎండీలో నీటిమట్టం తక్కువగా ఉండడం వల్లే పలు డివిజన్లల్లో మంచినీటి సరఫరాలో ఇబ్బందులు వస్తున్నాయి. ఇప్పటికే రా వాటర్ కోసం బూస్టర్ పంపులను వినియోగిస్తున్నాం. మోటర్ల సమస్య వల్ల నీటి ఇబ్బందులు ఉంటున్నాయి. ఎల్ఎండీలోకి మిడ్‌మానేరు నుంచి నీటి విడుదల చేయాలని కోరుతున్నాం. వేసవిలో నీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

**- మహేందర్, ఈఈ (కరీంనగర్ కార్పొరేషన్)**




వావిలాలపల్లిలో నగర పాలక సంస్థ ట్యాంకర్ ద్వారా వచ్చిన నీటిని పట్టుకుంటున్న మహిళలు

### మంచినీటి సరఫరాను మెరుగుపర్చాలి

మా 22వ డివిజన్ పరిధిలో పదిహేను రోజుల నుంచి రోజు విడిచి రోజు మంచినీరు ఇస్తున్నారు. ఎల్ఎండీలో నీరు లేకపోవడం వల్లే ఈ సమస్య వస్తున్నదని అధికారులు చెబుతున్నారు. మూడేళ్లుగా ఎక్కడ కూడా సరఫరాలో ఇబ్బంది రాలేదు. ఇప్పుడు ఫిబ్రవరి నుంచే అనేక కాలనీలకు రోజు విడిచి రోజు వస్తున్న నల్లా నీటిలోనూ తగినంత ప్రెషర్ రావడం లేదు. దీంతో ఆయా కాలనీలకు ట్యాంకర్లను పంపించాల్సి వస్తున్నది. ట్యాంకర్లను పంపించాలని అధికారులను కోరుతున్నా సరిగ్గా పంపడం లేదు. వెంటనే అధికారులు స్పందించాలి. ప్రజలకు ఇబ్బంది లేకుండా మంచినీటి సరఫరాను మెరుగుపర్చాలి.

**- గంట కల్యాణి, 22వ డివిజన్ కార్పొరేటర్ (కరీంనగర్)**



కోలుకున్న మల్లమ్మతో డాక్టర్ మహేందర్

## కరీంనగర్ జనరల్ దవాఖానలో

# అరుదైన శస్త్ర చికిత్స

పైసా ఖర్చు లేకుండా రూ.2 లక్షల విలువైన ఆపరేషన్

విద్యానగర్, మార్చి 1: కరీంనగర్ జనరల్ దవాఖాన వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. పైసా ఖర్చు లేకుండా రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షల విలువైన ఆపరేషన్ చేశారు. వివరాల్లోకి వెళ్తే..పెద్దపల్లి జిల్లా మంథని మండలం గుంజపడుగుకు చెందిన బరిబద్దుల మల్లమ్మ (65) కొద్దిరోజుల క్రితం కడుపునొప్పితో బాధపడుతూ జనరల్ హాస్పిటల్‌లో చేరింది. ప్రొఫెసర్, హెచ్ఓడీ డాక్టర్ శాలిని ఆధ్వర్యంలో మల్లమ్మను పరీక్షించారు. బల్లె (స్ప్లీన్) పగిలిపోయి బ్లీడింగ్ అవుతున్నట్లు గుర్తించారు. వెంటనే శస్త్ర చికిత్స చేయకపోతే ప్రాణాపాయం ఉంటుందని కుటుంబ సభ్యులకు తెలిపారు. క్లిష్టమైన శస్త్ర చికిత్సను సర్జికల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మహేందర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హరికృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రణయ్, అనస్తషీయా డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ శంతన్ ఆధ్వర్యంలో ఓపెన్ సర్జరీ చేశారు. శుక్రవారం పూర్తిగా కోలుకున్న మల్లమ్మను డిశ్చార్జి చేశారు. రూపాయి ఖర్చు లేకుండా లక్షల విలువ చేసే ఆపరేషన్‌ను చేయడంతో మల్లమ్మ కొడుకు రాజేశ్ వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

### మెరుగైన సేవలందిస్తున్నాం



కరీంనగర్ జనరల్ దవాఖానలో కార్పొరేట్‌కు దీటుగా మెరుగైన సేవలందిస్తున్నాం. ల్యాప్రోస్కోపిక్, కీలు మార్పిడి శస్త్ర చికిత్సలు చేస్తున్నాం. దవాఖానలో వైద్య బృందం సొంత పరికరాలతో సర్జరీలు చేయడం అభినందనీయం. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వ సహకారంతో రాబోయే రోజుల్లో మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి తెస్తాం.

**- డాక్టర్ వీరారెడ్డి, దవాఖానా సూపరింటెండెంట్**